క్లుప్తంగా

నిడదవోలు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీవోగా గోపాలకృష్ణ

నిడదవోలు రూరల్: మండల ఇన్‌చార్జ్ పంచాయతీ విస్తరణాధికారి (ఈఓపీఆర్డీ)గా తాడిమళ్ల పంచాయతీ కార్యదర్శి టి.గోపాలకృష్ణను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వి.జగదాంబ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఈఓపీఆర్డీగా పనిచేసిన టి.మూర్తిబాబు ఆచంట మండలానికి బదిలీపై వెళ్లారు. నిడదవోలు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రత్నరాజు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరవలి: పెరవలి ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో ఖాళీగా ఉన్న ఆరు అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ శ్రీలక్ష్మి తెలిపారు. నిడదవోలు మండలంలోని జీడిగుంట, పెండ్యాల, సమిశ్రగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లోను, ఉండ్రాజవరం మండలంలోని సత్యవాడ, ఉండ్రాజవరం అంగన్‌వాడీ కేంద్రాల్లోను, పెరవలి మండలంలోని ఖండవల్లి అంగన్‌వాడీ కేంద్రంలోను ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అర్హులు పూర్తిచేసిన తమ దరఖాస్తులను ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ కార్యాలయానికి అందజేయాలని ఆమె కోరారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులు సంతృప్తి

నిడదవోలు రూరల్: రబీలో పండిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే పారదర్శకంగా కొనుగోలు చేయడంతో రైతులందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, తిమ్మరాజుపాలెం గ్రామాల్లో ఆర్‌బీకే కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లకు సొసైటీ ద్వారా బుధవారం జీతాల చెక్కులను రామారావు అందజేశారు. అకాల వర్షాలతో తడిసిన, మొలకొచ్చిన ధాన్యాన్ని రైతులను నుంచి కొనుగోలు చేసే ప్రభుత్వం అండగా ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గిద్దా వెంకటేశ్వరనాయుడు, కార్యదర్శి పి.ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హంతకులను అరెస్టు చేయాలి

కొవ్వూరు: ప్రకాశం జిల్లా రాయవరం అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మ హత్యకు బాధ్యులను అరెస్ట్ చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన కొండలరావు అనే నాయకుడు తన ట్రాక్టర్‌తో కార్యకర్తను ఢీకొట్టి చంపారని ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్‌వీఎల్ పుష్ప, ఎస్.శాంతకుమారి, ఎంఐ నరసమాంబ, వి. శ్రీదేవి, సీహెచ్ చిన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

కొవ్వూరు: ఇక్కడకు సమీపంలోని గామన్ ఇండియా బ్రిడ్జి టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఆగిన ఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట మండలం రేణుగుంటపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఎస్‌కే హాసిన్ గాయపడ్డారు. సిమెంట్ లోడులో వెళ్లే లారీ టోల్ ప్లాజా వద్ద ఆగి ఉంది. అదే సమయంలో వేరొక లారీ వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. దీంతో వెనుక లారీలో ఉన్న డ్రైవర్ హాసిన్‌కి గాయాలయ్యాయి. రెండు లారీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. హాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు తెలిపారు.

విద్యా కానుకలు సిద్ధం



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యాకానుకల బ్యాగ్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ తిరుమలదాస్, హెచ్‌ఎం శ్రీలక్ష్మి



దేవరపల్లి హైస్కూల్లో సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

- బడులు తెరిచిన రోజునే పంపిణీకి ఏర్పాట్లు
- మూడు మండలాల్లో 17,997 మంది విద్యార్థులు

దేవరపల్లి: సర్కారీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న జగనన్న విద్యాకానుకలు పాఠశాలలకు చేరుకున్నాయి. ఈ కానుకల కిట్లను మూడు రోజులుగా మండల విద్యాశాఖ కార్యాలయాల నుంచి అధికారులు వివిధ పాఠశాలలకు చేరవేస్తున్నారు. మండల కేంద్రాలకు చేరుకున్న కానుకలను అధికారులు పరిశీలించి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి. నెల రోజుల ముందుగానే కానుకలను ప్రభుత్వం సరఫరా చేసింది. విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్ట్, రెండు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, డిక్షనరీని ప్రభుత్వం సిద్ధం చేసింది. కానుకలను ఈ నెల 12న అంటే పాఠశాలలు తెరిచిన తొలిరోజునే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

17,997 మంది విద్యార్థులకు..

గోపాలపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 17,997 మంది విద్యార్థులకు జగననవిద్యా కానుకలు అందిస్తున్నారు. మూడు మండలాల్లో 148 పాఠశాలలకు కానుకలను సరఫరా చేస్తున్నారు. దేవరపల్లి మండలంలోని 45 పాఠశాలల్లో 5,971 మంది, గోపాలపురం మండలంలోని 52 పాఠశాలల్లోని 6,042 మంది, నల్లజర్ల మండలంలోని 51 పాఠశాలల్లో 5,984 మంది విద్యార్థులు ఈ కానుకల కిట్లు అందుకోనున్నారు. దేవరపల్లి మండలానికి 70,112 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా మొదటి విడతగా 38,496 పాఠ్య పుస్తకాలను సిద్ధం చేశారు. 12 వేల పుస్తకాలు రావలసి ఉండగా, 20 వేల పుస్తకాలను రెండో విడతగా మూడో సెమిస్టర్‌లో అందజేస్తారు. ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు యూనిఫాం 5971, బూట్లు 5966, సాక్స్ 11,932 జతల చొప్పున అందిస్తారు. అలాగే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 35,766 నోట్ పుస్తకాలు, 688 మంది 6వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందిస్తారు. 1 నుంచి 10వ తరగతి బాలురు 2819 మందికి, బాలికలు 1294 మందికి బెల్ట్‌లు ఇస్తారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు 5971 బ్యాగులు, 38 496 పాఠ్యపుస్తకాలు అందిస్తున్నారు.

> **తొలి రోజే కానుకల పంపిణీ**
>
> 
>
> వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న ప్రభుత్వ బడులు తెరుచుకుంటాయి. అదే రోజున పాఠశాలల వద్ద విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల కిట్లను పంపిణీ చేస్తారు. విద్యార్థులకు అవసరమైన కానుకలను మండల కేంద్రంలో సిద్ధం చేశారు. వాటిని పాఠశాలలకు పంపిస్తున్నాం. మండలంలో 45 పాఠశాలల్లో 5179 మంది విద్యార్థులకు 38496 పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి.
>
> – ఎం. తిరుమలదాస్, మండల విద్యాశాఖాధికారి, దేవరపల్లి

రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధం



శంకరాపురంలో దగ్ధమైన రెండు పోర్షన్ల తాటాకిల్లు

నిడదవోలు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మండలంలోని శంకరాపురంలో బుధవారం మధ్యాహ్నం రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఈ గ్రామంలో మాడు గంగమ్మ అతని కుమారుడు రామారావు తమ కుటుంబాలతో ఆ తాటాకింటిలోని వేర్వేరు పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లోని ఫ్రిజ్ వద్ద విద్యుత్ వైర్లు కాలి మంటలు చెలరేగాయి. దాంతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైనట్టు నిడదవోలు అగ్నిమాపకాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఇంట్లో వస్తువులు అన్ని పూర్తిగా కాలిపోయాయని, కట్టుబట్టలతో ఉన్నామని బాధితుడు రామారావు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై వీఆర్వో సర్వేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

అదుపుతప్పి 104 వాహనం బోల్తా



సూరాపురంలో బోల్తా కొట్టిన 104 వాహనం

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం శివార్లలో బుధవారం ఉదయం 104 వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రత్యక్ష్య సాక్షుల కథనం ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కలవలపల్లి గ్రామస్తులకు వైద్య సేవలు అందించేందుకు నిడదవోలు నుంచి 104 వాహనం బయలుదేరింది. సూరాపురం శివార్లలో ఎదురుగా వేగంగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆ వాహనం బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్ మల్లికార్జునరావుకు, డేటా ఆపరేటర్ లోకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రతి మండలంలో జాబ్ మేళాలు



తాళ్లపూడి మెగా జాబ్‌మేళా సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న వికాస, మానవత సంస్థల సభ్యులు

- ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం
- జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్
- తాళ్లపూడి జాబ్ మేళాలో 304 మందికి ఉద్యోగాలు

తాళ్లపూడి: నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వికాస, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాల వద్ద ఆ కళాశాల సౌజన్యంతో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 612 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరవగా, వారిలో 304 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందినట్టు మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విభిన్నంగా ఆలోచిస్తు తమలోని ప్రతిభను చాటుతూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కేవలం ప్రభుత్వోద్యోగాల కోసమే చూడకుండా ఉద్యోగ రీత్యా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి కోసం వికాస పేరుతో ఓ విభాగాన్ని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి మండలంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కరిబండి విద్యా సంస్థల చైర్మన్ కరిబండి గనిరాజు, డైరెక్టర్ త్రినాథ స్వామి, మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, తహసీల్దార్ టి. రాధిక, వికాస సంస్థ మేనేజర్ రమేష్ , సాయన సుబ్బారావు, గోకవరపు బాబులు తదితరులు పాల్గొన్నారు.

రూ.39 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మొదటి దశ పనులకు నల్లజర్లలో శంకుస్థాపన



జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: జల్‌జీవన్ మిషన్ కింద రూ.39 కోట్ల వ్యయంతో గోపాలపురం నియోజకవర్గంలో మొదటి, రెండో దశల్లో తాగునీటి సరఫరా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. మొదటి దశలో నల్లజర్ల మండలంలోని 15 గ్రామాల ప్రజలకు సురక్షిత జలాలు అందించే తొలి దశ పనులకు నల్లజర్లలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండలంలో రూ.5.57 కోట్ల వ్యయంతో ఈ పనుల చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో 125 కిలోమీటర్ల పొడవైన తాగునీటి పైపులైన్లు వేసే పనులను రూ.16 కోట్ల వ్యయంతో త్వరలో మొదలు పెడతామన్నారు. మండలాల వారీగా దేవరపల్లిలో 16, నల్లజర్లలో 15, గోపాలపురంలో 14 గ్రామాల్లో పైపు లైన్లు వేస్తారన్నారు. నల్లజర్లలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి ట్యాంకు, ముసుళ్ళగుంట, ఆవపాడులలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో చేసిన సర్వే ప్రకారం నల్లజర్ల మండలంలో దాదాపు మూడు వేల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అప్పారావు, ఎంపీడీఓ శేఖర్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ‘విద్యానిధి’ పురస్కారాలు



టెన్త్ మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గోపాలపురం: సమాజంలో ప్రతి వ్యక్తికీ విద్యతోనే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మండలంలోని విద్యార్థులకు మానవతా విద్యానిధి సంస్థ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు నగదు ప్రతిభా ప్రోత్సాహకాలు అందజేశారు. తన తల్లి దండ్రులు అర్జునరావు, కమలావతి జ్ఞాపకార్థం స్థానిక శర్వాణి హైస్కూల్లో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగన్నాథపురం జెడ్పీ హైస్కూల్ నుంచి 577 మార్కులు సాధించిన విద్యార్థిని పుప్పాల హర్షవర్షినికి ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, రాజంపాలెం హైస్కూల్ నుంచి 571 మార్కులు సాధించిన ఎం.లేఖనకు ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, అదే హైస్కూల్ నుంచి 560 మార్కులు సాధించిన ఎం.లక్ష్మీ సావిత్రికి తృతీయ స్థానంగా రూ.2500 నగదు బహుమతులు అందజేశారు. కాగా మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున మానవత సంస్థ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా చైర్మన్ రామిశెట్టి గంగాధర్, మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, బలుసు సత్యనారాయణ, బూరెడ్డి శ్రీనివాస్, శర్వాణి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫణికుమార్, కె. కీర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండ్రాజవరంలో టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఉండ్రాజవరం: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు యుటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.వెంకటరత్నం బుధవారం తెలిపారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. 2023 సంవత్సరంలో మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.రాంబాబు, మండల శాఖ కార్యదర్శి దువ్వాపు రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గేదెల వ్యాన్ స్వాధీనం

కొవ్వూరు: అక్రమంగా తరలిస్తున్న గేదెల ఆటోను బుధవారం గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. మినీ వ్యాన్‌లో ఉన్న 11 గేదెలను రాజమహేంద్రవరంలో గోశాలకి అప్పగించామన్నారు. వ్యాన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డీఎస్‌హెచ్‌ఎస్‌గా ఏపీ వైద్య విధాన పరిషత్

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి చట్టం రద్దు పరుస్తూ కమిషనర్ వైద్య విధాన పరిషత్ అనే పేరును డైరెక్టర్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేసింది. అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నీలిమ మాట్లాడుతూ విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖలానే ప్రభుత్వశాఖగా మార్చుతూ తీర్మానం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ సంబరాలు చేసుకుంటున్నారన్నారు. 35 ఏళ్లుగా వైద్య విధాన పరిషత్ ఆశించిన లక్ష్యాలను ముఖ్యంగా సర్వీసు నిబంధన ఏర్పాటు, పూర్తి స్థాయి సిబ్బంది కల్పన, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల చెల్లింపు వంటి విషయాలలో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటూ వస్తోందన్నారు. వైద్య విధాన పరిషత్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జారీ చేసిన హెల్త్ కార్డులు కూడా ఈ ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం పెంచుకోవాలి



నల్లజర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు గణితంలో సులభ పద్ధతులు వివరిస్తున్న టీచర్ ప్రకాష్

చాగల్లు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల సాయంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి అన్నారు. చంద్రవరంలో శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. శిక్షణ తరగతుల్లో కథలు చెప్పడం, పుస్తక పఠనం, కంప్యూటర్, పాటలు, డ్రాయింగ్, వ్యాసరచన వంటి వాటిని విద్యార్థులకు నేర్పిస్తున్నాయని గ్రంథాలయ అధికారి సుమన్‌కుమార్ చెప్పారు. ఈ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ఇస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు బండి అశోక్‌బాబు, ఎం.కోదండరామ్, గుమ్మడి శైలేంద్రరావు, మద్దిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చాగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు వ్యాకరణం, కంప్యూటర్‌పై అవగాహన కల్పించినట్టు గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు తెలిపారు. రీసోర్స్ పర్సన్ ఏవీఎస్ శాస్త్రి విద్యార్థులకు వ్యాకరణంలోని పలు అంశాలను వివరించారు.

నల్లజర్ల: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నల్లజర్ల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం క్యారమ్స్, చెస్‌లతో పాటు పలు రకాల పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకురాలు ఏవీ రమణ ఈ పోటీలు జరిగాయి. గణితంలో సులభ పద్ధతులు, గణిత చమత్కార మంజరి వంటి విషయాలను ప్రకాష్ మాస్టారు విద్యార్థులకు వివరించారు. ఆట,పాటలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు.

మోదీ తొమ్మిదేళ్ల పాలనపై సంబరాలు



బీజేపీ సీనియర్ కార్యకర్తను సత్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీలో సీనియర్ నాయకులు, కార్యకర్తలను సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ బీజేపీ వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా కార్యకర్తలు దీర్ఘకాలం పాటు సేవలందించడం గర్వించదగిన విషయం అన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నీరుకొండ సూర్యనారాయణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మడిచర్ల రామచంద్రరావు, మండలశాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు, చాగల్లు అధ్యక్షుడు కరుటూరి జగన్, చెరుకూరి సాయిరాజు, కొండపల్లి రత్నసాయి, బాదరాల ఉమామహేశ్వరరావు, గోపిశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలతో విద్యకు ప్రాధాన్యం

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో భాష, గణితంలో అభ్యసనా సామర్థ్యాలతో విద్యకు అధిక ప్రాధాన్యత ఏర్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్‌ఎల్‌ఎన్) అంశంపై గురువారం సదస్సు జరిగింది. దీనికి హాజరైన డీఈవో మాట్లాడుతూ మూడు నుంచి తొమ్మిదేళ్ల వయసు గల పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు ముఖ్యంగా భాష, గణితంలో పునాది విద్యనందించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ఒకటి నుంచి మూడు తరగతుల విద్యార్థులకు బాషాభ్యాసనం, గణిత సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా జీ 20 సదస్సు, జాతీయ విద్యా విధానం 2020, ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాలపై డైట్ సీనియర్ లెక్చరర్ నూజిళ్ల రామ సుబ్రహ్మణ్యం వివరించారు. విద్యార్థులకు పద్య పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.సమగ్ర శిక్ష ఏఎంవో డి.గౌరీశంకరరావు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు పుష్కరఘాట్‌లో మెప్మా బజార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలకసంస్థ మెప్మా విభాగం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో స్థానిక పుష్కరఘాట్ వద్ద మెప్మా అర్బన్ మార్కెట్ (బజార్) ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా రెండో గురు, శుక్రవారాల్లో ఈ మార్కెట్ ఉంటుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన దుస్తులు, స్త్రీల అలంకార వస్తువులు, జ్యూట్ బ్యాగులు, కొయ్య బొమ్మలు, ఆయుర్వేదిక్ ప్రోడక్టులు, రాగిపిండితో తయారుచేసిన కప్పులు, వైర్ బ్యాగులు, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లు, వన్‌గ్రామ్ గోల్డ్ నగలు విక్రయిస్తారన్నారు.